ఇసుక రవాణాలో వసూళ్ల దందా

ఎద్దుల బండికి రూ.200... ట్రాక్టర్‌కు రూ.500


హిందూపురం సమీపంలోని పెన్నానది నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలింపు

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం సమీపంలోని పెన్నానదిలో ఇసుక వసూళ్ల దందా కొనసాగుతోంది. స్థానికంగా ఉన్న కొంతమంది నది, నదీ తీర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకొని ఇక్కడి నుంచి ఇసుక తరలిస్తే తమకు కప్పం కట్టాల్సిందేనని ఎద్దుల బండి నుంచి రూ.200, ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తే రూ.500 వసూలు చేస్తున్నారు. రెండు నెలల నుంచి ఈ వసూళ్ల దందా నిరాటకంగా కొనసాగుతోంది. సూగూరు, పోచనపల్లి, సంజీవరాయనపల్లి గ్రామాలు పట్టణానికి సమీపంలో ఉన్నాయి. ఈ గ్రామాలకు పెన్నానది దగ్గరగా ఉండటంతో కొందరు దీన్ని అవకాశంగా చేసుకొని పెద్దఎత్తున సొమ్ము చేసుకొంటున్నారు. పట్టణంలో ప్రైవేట్ ఇళ్ల నిర్మాణాలు, ఇతర కార్యక్రమాలు జరుగుతుండటంతో ఇసుకకు అధిక డిమాండ్ ఉంది. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో రహస్యంగా ఇసుక డంప్‌లు కూడా ఏర్పాటు చేసుకొన్నారు. ఇలా రెండు మాసాల వ్యవధిలోనే ఒక్కొక్కరు రూ.లక్షలు వసూలు చేసి సొమ్ము చేసుకొంటున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. అధికారులు సత్వర చర్యలు తీసుకొని దీనిని కట్టడి చేయకపోతే పెన్నానదిలోని ఇసుక పూర్తిస్థాయిలో తరలిపోయే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయంపై డీఎస్పీ మహేశ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా దృష్టి సారించి అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై చర్యలు తీసుకొంటామన్నారు.


ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంత

కడుపున పుట్టకపోయినా..

కన్నతల్లిలా..

అనాథలైన ముగ్గురు చిన్నారుల చేరదీత


పిల్లల ఆలనాపాలన చూసుకుంటున్న అమృత

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆడిపాడే వయసులో.. అమ్మఒడిలో అల్లారుముద్దుగా పెరగాల్సిన బాల్యం వాడిపోయింది. ఆలనాపాలన చూడాల్సిన తల్లిదండ్రులు దూరమవడంతో ఆ పసి హృదయాలు తల్లడిల్లుతున్నాయి. అనాథలుగా మారి.. ఇరుగుపొరుగువారి దయాదాక్షిణ్యాలతో కాలం వెల్లదీస్తున్నాయి. వారి దీనస్థితిని చూసి చలించిన ఓ మహిళ అక్కున చేర్చుకుంది. కడుపున పుట్టకపోయినా.. కన్నతల్లిలా బాగోగులు చూస్తోంది. పేరే కాదు.. మనసూ అమృతమేనని చాటుతోంది.

చిత్తూరు నుంచి వలస వచ్చి..

చిత్తూరుకు చెందిన భవాని, చంద్రులు జీవనోపాధి కోసం ఐదేళ్ల కిందట పుట్టపర్తికి వలస వచ్చారు. హోటళ్లు, ఇళ్లలో పనులు చేసుకుని జీవనం సాగించేవారు. వీరికి కుమార్తె పూర్విక, పృథ్వీసాయి, పవన్‌సాయి (కవలలు) ఉన్నారు. పూర్విక శివాలయం వీధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. కొన్నేళ్ల కిందట చంద్రు.. భార్య బిడ్డలను వదిలి ఆచూకీ లేకుండాపోయాడు. తల్లి భవాని గతేడాది సెప్టెంబరు 13న అనారోగ్యంతో కన్ను మూసింది. అప్పటి నుంచీ పిల్లలకు కష్టాలు మొదలయ్యాయి. పవన్‌సాయికి పుట్టకతోనే బుద్ధిమాంద్యం. నడవలేని పరిస్థితి. సొంత ఇల్లు లేదు. కట్టుకోవడానికి దుస్తులు లేవు. చూసుకోవడానికి బంధువులు లేరు. దీంతో జీవితం అంధకారంగా మారింది.

ఆమె మనసు అమృతం


మూడేళ్లైనా నడలేని పవన్‌సాయి

ఇలాంటి దీన పరిస్థితిలో నేనున్నానంటూ ముందుకొచ్చారు పక్కింట్లో ఉంటున్న అమృత. తనకు పిల్లలు లేకపోవడంతో ఆ ముగ్గురు చిన్నారులను తన పిల్లలుగా భావించి ఆలనాపాలనా చూస్తున్నారు. ఇరుగుపొరుగువారు దయతో పిల్లలకు పండ్లు, ఆహారం ఇస్తున్నారు. అయితే.. పిల్లల బాగోగులు చూసుకోవడం కోసం అమృత పనికి వెళ్లడం మానేయాల్సి వచ్చింది. ఫలితంగా కుటుంబం గడవడం భారంగా మారింది. భర్త హోటల్‌లో పనిచేసి ఐదుగురినీ పోషించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో పిల్లల చదువు, ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేసి అనాథ పిల్లలకు ఓ దారి చూపాలని అమృత అర్థిస్తోంది. మనసున్న దాతలు స్పందించాలని వేడుకుంటోంది.

కల్లు కాదు..

కాలకూటవిషం!

● ఉమ్మడి జిల్లాలో కల్తీతో విక్రయాలు ● చోద్యం చూస్తున్న యంత్రాంగం



ఈనాడు, పుట్టపర్తి, న్యూస్‌టుడే హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కల్తీ కల్లు ఏరులై పారుతోంది. సహజసిద్ధంగా చెట్ల నుంచి తీసిన కల్లు పది శాతం అవసరాలను తీర్చడం లేదు. వ్యవసాయ క్షేత్రాలు, రహస్య ప్రదేశాల్లో హానికర రసాయనాలతో తయారు చేస్తున్నారు. చాలా మంది కల్తీ కల్లుకు అలవాటు పడి.. రోజూ దాన్ని తాగకుండా ఉండలేని స్థితికి చేరుకుంటున్నారు. కొన్ని రోజులకు ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రుల పాలవుతున్నారు. కొందరు మతిస్థిమితం కోల్పోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇంతలా కల్తీ కల్లు మాఫియా రెచ్చిపోతున్నా ఎక్సైజ్ శాఖ పట్టించుకోవడం లేదు. మామూళ్ల మత్తులో మునిగి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


హిందూపురంలో కల్లు సీసాలు

డైజోఫాం కలిపేసి..

ఉమ్మడి జిల్లాలోని హిందూపురం, మడకశిర, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో డిమాండ్‌కు సరిపడా ఈత చెట్లు లేవు. దీన్ని అక్రమార్కులు ఆసరాగా చేసుకుని కల్తీ దందా సాగిస్తున్నారు. పది లీటర్ల స్వచ్ఛమైన కల్లుకు 150 లీటర్ల నీళ్లు కలుపుతారు. డైజోఫాం, క్లోరోహైడ్రేట్ తదితర రసాయనాలను వాడుతున్నారు. మొత్తం మిశ్రమాన్ని నీటి తొట్టెలో కలియ తిప్పుతారు. తీపి కోసం శాక్రిన్, నురగ రావడానికి అమ్మోనియం కలుపుతారు. ఇలా ఉదయం తయారు చేసిన మిశ్రమానికి ఈస్ట్ కలిపి సాయంత్రం వరకు పులియబెడతారు. ఆల్ప్రోజోలం అనే హానికరమైన రసాయనాన్ని వినియోగిస్తున్నారు. అల్ప్రాజోలం గ్రాము ధర రూ.500. ఒక గ్రాముతో డ్రమ్ము కల్లు తయారు చేయవచ్చు. అంటే సుమారు 300 సీసాలు తయారుచేసి ఒకదాన్ని రూ.40కు విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. రసాయనాలను హైదరాబాద్ నుంచి గుత్తి, గుంతకల్లు మీదుగా తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి అనంత జిల్లాలో ఇలా..

- టీఎఫ్‌టీలు (ట్రీ ఫర్ ట్యాపర్): 337
- కల్లుగీత కార్మికుల సహకార సంఘాలు: 159
- లైసెన్సు కల్లు దుకాణాలు: 496
- అనధికారంగా నిర్వహిస్తున్న దుకాణాలు: 900

కొన్ని ఉదంతాలు..

- గత నెలలో హిందూపురం పరిధిలోని చౌళూరులో ఓ వృద్ధుడు కల్తీకల్లు తాగి చనిపోయాడు. విషయం బయటకు రానీయకుండా అధికారులు జాగ్రత్త పడినట్లు విమర్శలు ఉన్నాయి.
- పెనుకొండ మండలంలో గతేడాది కల్తీ కల్లు తాగి వ్యవసాయ కూలీలు అస్వస్థతకు గురయ్యారు. పనుల నుంచి సాయంత్రం తిరిగి వచ్చిన సుమారు 30 మంది కల్లు తాగడంతో వాంతులు, విరేచనాలు అయ్యాయి. అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.
- గతేడాది సెప్టెంబరులో పరిగి మండలంలోని ఓ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కల్తీకల్లు తాగి మృత్యువాతపడ్డాడు.

కొరవడిన పర్యవేక్షణ

ఎక్సైజ్ నిబంధనల ప్రకారం కల్లు దుకాణం పరిధిలో ఎన్ని ఈత చెట్లు ఉన్నాయి? వాటి నుంచి రోజుకు ఎంత ఉత్పత్తి అవుతోంది? అనే వివరాలు పక్కాగా ఉండాలి. ఈత చెట్లకు నంబర్లు కేటాయించాలి. ఎక్సైజ్ అధికారులు రెండు దశాబ్దాల కిందటి లెక్కలనే చూపుతున్నారు. నిబంధనల ప్రకారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు కల్లు దుకాణాలను పర్యవేక్షించాల్సి ఉన్నా.. క్షేత్రస్థాయిలో ఆ దిశగా చర్యలు కొరవడ్డాయి. నమూనాలను ప్రాథమికంగా పరీక్షించడానికి అధికారుల వద్ద మినీ కిట్లు ఉంటాయి. అధికారులు నమూనాల ఫలితాలను వెల్లడించడం లేదు. కల్తీ తేలితే కొంత మొత్తం జరిమానా విధించి చేతులు దులుపుకొంటున్నారు.

నాడీ వ్యవస్థపై ప్రభావం

కల్తీ కల్లులో వాడే డైజోఫాం, క్లోరోహైడ్రేట్‌తో నాడీవ్యవస్థ తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఆలోచనా శక్తి తగ్గి.. మతిమరుపు రావడంతోపాటు కాలేయం దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. మానసిక, శారీరకంగా కుంగిపోయి.. కుటుంబం, సమాజం పట్ల విచక్షణా రహితంగా ప్రవర్తిస్తారు, దీర్ఘకాలిక వ్యసనంతో మరణం సంభవిస్తుందని పేర్కొంటున్నారు.

విస్తృతంగా తనిఖీలు చేస్తాం..

- నాగమద్దయ్య, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ శాఖ


కల్లులో డైజోఫాం, అల్ప్రాజోలం ఏమాత్రం కలపకూడదు. ఎప్పటికప్పుడు నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తాం. ఇప్పటివరకు కల్తీ కల్లుపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. అన్ని చోట్ల తనిఖీలు చేస్తాం. కల్తీ కల్లు తయారుచేసినట్లు తేలితే లైసెన్సు రద్దుతో పాటు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

ఫిర్యాదులపై చట్టపరిధిలో చర్యలు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలను చట్టపరిధిలో విచారించి సత్వర పరిష్కారం చూపాలని ఎస్పీ రత్న అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భూ, ఆస్తి వివాదాలు, గొడవలు తదితర సమస్యలపై 32 ఫిర్యాదులు అందాయి. సమస్యలు విన్న ఎస్పీ పోలీసు అధికారులతో చరవాణిలో మాట్లాడి పూర్వాపరాలు విచారణచేసి ఫిర్యాదు అంశాలు వాస్తవమైతే చట్టపరిధిలో తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, న్యాయ సలహాదారు సాయినాథరెడ్డి, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్బీ ఎస్సై ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీకరి.. శుభకరి



జిల్లాలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. అపురూప అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. సోమవారం హిందూపురంలోని కన్యకాపరమేశ్వరి.. గజలక్ష్మిగా కొలువుదీరారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి.. అమ్మవారిని తిలకించి పులకించిపోయారు.

- న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్

కలెక్టరేట్‌లో చుక్కనీరు దొరికితే ఒట్టు..?

❖ క్యాన్లు కొనుగోలు చేస్తున్న ఉద్యోగులు ❖ సందర్శకులకు తప్పని దాహార్తి తిప్పలు


ట్యాంకర్ నీటిని క్యానలోకి నింపుతూ..

పుట్టపర్తి, న్యూస్‌టుడే : శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి కలెక్టరేట్‌లో దాహార్తి తీర్చుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు గుక్కెడు తాగునీటి సౌకర్యం కల్పించిన దాఖలాలు లేవు. కలెక్టరేట్‌లో వివిధ విభాగాలతోపాటు గృహ నిర్మాణ, పౌరసరఫరాలు, జిల్లా ప్రణాళిక, భూమి, సర్వే రికార్డుల శాఖలు ఉన్నాయి. ఆ శాఖల ఉద్యోగులకు అనుగుణంగా తాగునీటి క్యాన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో క్యాన్‌కు రూ.10 చెల్లిస్తున్నారు. ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 400 నుంచి 500 మంది ప్రజలు వస్తుంటారు. సందర్శకులకు కలెక్టరేట్ పరిసరాల్లో ఎక్కడా తాగునీటి సౌకర్యం లేకపోవడంతో బయటికెళ్లి నీళ్ల సీసాలు కొనుగోలు చేసి దప్పిక తీర్చుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు కూడా లేవు. కార్యాలయ పరిసరాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి సందర్శకుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. కలెక్టరేట్ వచ్చే సందర్శకులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని డీఆర్ఓ కొండయ్య తెలిపారు.

అర్జీలు వెంటనే పరిష్కరించండి: మంత్రి సవిత


తమ సమస్యలను మంత్రికి విన్నవిస్తున్న బాధితులు

పెనుకొండ, న్యూస్‌టుడే: ప్రజా అర్జీల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీదారుల సమస్యలకు వెంటనే సంబంధిత అధికారులు పరిష్కారం చూపాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొన్న మంత్రి సవితకు 410 మంది అర్జీదారులు వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. వీటిలో ఎక్కువగా వైకాపా పాలనలో నాయకుల దౌర్జన్యంతో ఆక్రమించిన భూ సమస్యలు, రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్లు, తదితర వాటిపైనే ఉన్నాయి. అర్జీదారుల సమస్యలను సావధానంగా విన్న మంత్రి అక్కడే ఉన్న సబంధిత అధికారులతో మాట్లాడి, సమస్య ఎన్ని రోజుల నుంచి ఉంది, ఇన్నిరోజులు ఎందుకు పరిష్కరించలేకపోయారని ఆరా తీశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులతో విచారణ జరిపించి ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. ఇకపై ప్రతి మండలంలోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీధర్, ఇతర అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్కేయూ పాలకమండలి సమావేశానికి సన్నాహాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పాలకమండలి సమావేశం నిర్వహణపై కసరత్తు సాగుతోంది. పాలకమండలి చివరి సమావేశం గత జులైలో జరిగింది. ఈనెల 7 నాటికి పాలకమండలి సమావేశం నిర్వహించి 3 నెలలవుతుంది. ఈమేరకు వర్సిటీ యంత్రాంగం సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే అన్ని విభాగాలకు సర్క్యులర్ పంపించారు. చర్చించాల్సిన అంశాల నివేదిక ఇవ్వాలని విభాగాధిపతులకు సూచించారు. నివేదికలు వచ్చిన వెంటనే అజెండా రూపొందించనున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నియమితులైన నామినేటడ్ సభ్యులు ఇప్పటికీ కొనసాగుతున్నారు. నూతన పాలకమండలి ఏర్పాటు అయ్యే వరకూ పాత పాలకవర్గం కొనసాగుతుంది. పాలకమండలిలో చర్చించాల్సిన అంశాలు ఎక్కువగానే ఉన్నట్లు సమాచారం. వర్సిటీలోని వివిధ అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

దసరా తర్వాత నిర్వహిస్తాం..

ఆచార్య బి.అనిత, ఇన్‌ఛార్జి ఉపకులపతి

ప్రస్తుతం అజెండా రూపొందిస్తున్నాం. దసరా పండగ అనంతరం సమావేశమవుతాం. ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఆదేశాల మేరకు సమావేశం నిర్వహిస్తాం.

పకడ్బందీగా ఉచిత ఇసుక విధానం అమలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉచిత ఇసుక విధానం అమలుపై జేసీ అభిషేక్‌కుమార్, ఎస్పీ రత్నతో కలిసి అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు వర్షాల వల్ల పనిచేసేందుకు వీలు కాలేదని, ఈనెల 15వ తేదీ తర్వాత మాన్యువల్ ఆపరేషన్‌లో నిర్వహిస్తామన్నారు. పట్టా భూమిలో ఇసుక ఉంటే సరఫరాపై చర్చించి వాడుకలోకి తీసుకువస్తామని తెలిపారు. సీసీరేవు, పీసీరేవులలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. పై రెండు కేంద్రాల్లో ప్రస్తుతం 1,15,000 మెట్రిక్ టన్నులకుపైగా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రోజూ 4 వేల మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేయడం జరుగుతుందని వివరించారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ జిల్లాలో అక్రమ తవ్వకాలు, రవాణా, నిల్వలు, బ్లాక్‌లో విక్రయాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

సరకుల మూట.. పొదుపు బాట

➤ 'రైతు అంగడి' పేరిట విక్రయాలు ➤ సత్ఫలితాన్నిస్తున్న మహిళల ప్రయత్నం


శెట్టూరులో సరకుల కిట్టు విక్రయిస్తున్న సభ్యులు

ఉరవకొండ, కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాల(ఎఫ్‌పీవో) సభ్యులు వినూత్నంగా ఆలోచించారు. గ్రామాల్లో 'రైతు అంగడి' ఏర్పాటు చేసి పండగల పూట నిత్యావసర సరకులు విక్రయిస్తున్నారు. వారి ప్రయత్నం సత్ఫలితాన్నిస్తోంది. ఆ వచ్చిన లాభాలను పొదుపు చేస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నారు. జిల్లాలోని కళ్యాణదుర్గం, కూడేరు, కుందుర్పి, బెళుగుప్ప, శెట్టూరు, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో 14 రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాలు(ఎఫ్‌పీవో) ఉన్నాయి. వాటిలో 5వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరంతా సమావేశమై పండగల సమయంలో కాస్త తక్కువ ధరకే ఓ కుటుంబానికి సరిపడే నిత్యావసరాలు విక్రయించాలని ఆలోచించారు. వీరికి ఏఎఫ్ ఎకాలజీ ప్రోత్సాహం అందిస్తోంది. మొత్తం రూ.14 లక్షల విలువైన 16 రకాల సరకులను హోల్‌సేల్‌గా కొనుగోలు చేశారు. వాటిని ఓ సంచిలో ఉంచి దసరా కిట్‌గా తయారు చేశారు. కిట్లను గ్రామాల్లో 'రైతు అంగడి' ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు 1000 కిట్లు తయారు చేశారు. ఒక్కోటి రూ.700కు అమ్ముతున్నారు. ఒక్కో కిట్టుపై రూ.50 లాభం వచ్చేలా నిర్ణయించారు. అది కూడా వారి ఎఫ్‌పీవోల పొదుపులోకి చేరనుంది. దీపావళి నాటికి 3వేల కిట్లు విక్రయించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు.

గ్రామీణులకు తోడ్పడాలన్న ఉద్దేశంతోనే..

పండగకు అవసరమైన సరకులు కొనేందుకు గ్రామీణులు పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. అందుకు వారు పనులు వదులుకుని, ఓ రోజంతా కేటాయించాలి. పైగా వ్యయ ప్రయాసకులోను కావాల్సి వస్తుంది. దీన్ని గుర్తించిన ఎఫ్‌పీవోలు పండగ సరకులను కిట్లుగా తయారు చేసి స్థానికంగా విక్రయిస్తున్నారు. ప్రజలు సైతం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

చక్కటి ఆదరణ లభిస్తోంది

- హేమలత, ఎఫ్‌పీవో ప్రతినిధి, కళ్యాణదుర్గం



మూడేళ్లుగా దసరా, ఉగాది పండగ సమయాల్లో సరకుల కిట్లు విక్రయిస్తున్నాం. ఈసారి పక్క మండలాలకు విస్తరించాం. గతంలో కంటే ఎక్కువ కిట్లు అమ్ముడుపోవడానికి అవకాశం ఉంది. గ్రామీణుల నుంచి చక్కటి ఆదరణ లభిస్తోంది. ఎఫ్‌పీవోల అభ్యున్నతి, గ్రామాల ప్రజలకు తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో దీన్ని చేపట్టాం. ఏఎఫ్ ఎకాలజీ అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారు.

చిన్నారిని వదిలివెళ్లిన తల్లి ఆచూకీ లభ్యం



చిన్నారిని శిశువిహార్ సిబ్బందికి అప్పగిస్తున్న ఐసీడీఎస్ ఉద్యోగులు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి ఆర్టీసీ బస్టాండులో ఆదివారం ఐదునెలల చిన్నారిని వదిలివెళ్లిన మహిళ ఆచూకీని పోలీసులు గుర్తించారు. వివరాలు.. అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన జ్యోతికి అదే ప్రాంతానికి చెందిన వ్యక్తితో పెళ్లయింది. ఇద్దరు పిల్లలయ్యాక భర్త మృతిచెందారు. పిల్లలిద్దరూ అత్తమామల వద్దే ఉండటంతో జ్యోతి ఉపాధి కోసం బెంగళూరుకు వలస వెళ్లింది. కర్ణాటకలోని బేతం గ్రామానికి చెందిన కుమార్‌ను రెండో పెళ్లి చేసుకుంది. పాప పుట్టాక భర్త నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. రెండో భర్త వేధింపులు భరించలేక జ్యోతి ఐదునెలల బిడ్డతోపాటు ఎక్కడికైనా వెళ్లిపోవాలని నిర్ణయించుకుని కదిరికి చేరుకుంది. ఏం చేయాలో అర్థం కాక బిడ్డను ఆదివారం సాయంత్రం బస్టాండులో ఓ యువతికి అప్పగించి చనిపోవాలని నిర్ణయించుకుంది. పాప పదేపదే గుర్తుకొస్తుండటంతో ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనను విరమించుకుని రాత్రంతా కదిరి పట్టణ శివారులోనే ఉండిపోయింది. కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు గాలింపు చేపట్టారు. ఒంటరిగా ఉన్న జ్యోతిని స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా అసలు విషయం చెప్పింది. కౌన్సెలింగ్ అనంతరం జ్యోతిని ఆమె సమీప బంధువులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

శిశువిహార్‌కు చిన్నారి

ఐదునెలల చిన్నారిని స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు ఐసీడీఎస్ సిబ్బందికి అప్పగించారు. ఐసీడీఎస్ సిబ్బంది, పోలీసులు పాపను అనంతపురంలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరచగా చిన్నారి సంరక్షణ దృష్ట్యా పుట్టపర్తిలోని శిశు విహార్‌కు అప్పగించినట్లు కదిరి పట్టణ పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది తెలిపారు.

ఆదాయానికి మహాగని

మడకశిర గ్రామీణం, అమరాపురం, న్యూస్‌టుడే: మడకశిర నియోజకవర్గంలో రైతులు వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగానే గుడిబండ, అమరాపురం మండలాల్లో కొందరు రైతులు సుమారు 10 ఎకరాల్లో మహాగని చెట్లు పెంచుతున్నారు. ఇది దీర్ఘకాలిక పంట. ఒక ఎకరాల్లో ఆదాయం పొందవచ్చని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 400 మొక్కలు నాటుకోవచ్చు. రెండేళ్ల వరకు మొక్కలకు నీరందిస్తే.. ఆపైన అవసరం ఉండదు. ఒక్కో చెట్టు 70 అడుగుల వరకు పెరుగుతుంది. బంజర భూముల్లో కూడా సాగు చేయొచ్చు. 13 ఏళ్ల తర్వాత చెట్లు కోతకు వస్తాయి. 20 ఏళ్ల వరకు ఆగితే కలప మంచి గిరాకీ ఉంటుంది. ఒక అడుగు కలప రూ.1300 నుంచి రూ.2వేల వరకు ధర పలుకుతుంది. ఈ లెక్కన కనీసం 50 అడుగులకు లెక్కగట్టినా ఒక్కో చెట్టుపై రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది.



అమరాపురం మండలం గుణేహళ్లి వద్ద మహాగని చెట్లు

రైతేరాజు

కలపకు డిమాండ్

మహాగని కలప.. టేకు కన్నా గట్టిగా ఉంటుంది. దీన్ని గృహోపకరణాలు, వివిధ ఉపకరణాల తయారీకి వాడతారు. ఇది ఉప్పు నీటిలో పాడవదు. ఎక్కువగా పడవల తయారీకి ఉపయోగిస్తారు. దీని గింజలను డయాబెటిక్‌కు ఉపయోగిస్తారు. కిలో విత్తనం వేల రూపాయల ధర పలుకుతుందని చెబుతున్నారు.

అంతర పంటలు సాగు చేసుకోవచ్చు

10/10 అడుగుల విస్తీర్ణంలో మహాగని మొక్కలు నాటుకుని వాటి మధ్య బొప్పాయి, జామ, మిరియాలు, అరటితోపాటు మరగా ఉండే పంటలు సాగు చేసుకోవచ్చు. 20 ఏళ్లకు కలప కోతకు వస్తుండటంతో అంత వరకు రైతులకు అదనంగా ఆదాయం రావాలంటే అంతర పంటలు సాగుచేసుకోవచ్చు.

ఖర్చు, శ్రమ తక్కువ..



కర్ణాటకలోని ధర్మస్థలలో మహాగని పంట గురించి తెలుసుకున్నా. ఒక్కో మొక్కను రూ.70 చొప్పున మొత్తం 1,200 మొక్కలు తెచ్చాను. వాటిని 2.25 ఎకరాల్లో నాలుగేళ్ల కిందట నాటాను. అంతర పంటలుగా బొప్పాయి, జామ వేశా. చెట్టుకు ఎలాంటి మందులు, ఎరువులు అవసరం ఉండదు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చు. మొక్కలు ఇచ్చిన డీలర్లు పదేళ్లకోసారి వచ్చి వడ్డీ లేకుండా రూ.50వేల వరకు ఇస్తారు. చెట్లు ఎత్తు పెరిగాక ఆ మొత్తాన్ని తీసుకుని, కలపను కొనుగోలు చేసి తీసుకెళ్తారు. **- గురుమూర్తి, గుణేహళ్లి, అమరాపురం మండలం**

జీబీసీ గండి పూడ్చివేత పనులకు శ్రీకారం

విడపనకల్లు (ఉరవకొండ), న్యూస్‌టుడే: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ) గండి పూడ్చివేత పనులను సోమవారం అధికారులు ప్రారంభించారు. 28.5 కి.మీ. వద్ద గండి పడిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మంత్రి జీబీసీ ఈఈ వెంకటరమణతో చరవాణిలో మాట్లాడారు. కాలువ ఆయకట్టు కింద ఇప్పటికే రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారని, గండి పూడ్చివేత పనులను యుద్ధప్రాతిపదికన చేట్టాలని ఆదేశించారు. ఈఈ, డీఈఈ రఘుచరణ్, తెదేపా నాయకులు శీన, భీమలింగప్ప, సీతారాముడు, రామాంజనేయులతో కలిసి గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. పొక్లెయిన్‌తో మరమ్మతు పనులు చేపట్టారు. రెండు మూడు రోజుల్లో పనులు పూర్తవడానికి అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



పొక్లెయిన్‌తో పనులు చేయిస్తున్న అధికారులు

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తుకు 15 వరకు గడువు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి ప్రతిభ ఉపకార వేతనాలు (ఎన్‌ఎంఎంఎస్) కోసం నిర్వహించే పరీక్షల దరఖాస్తుకు గడువు ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు పరీక్షల విభాగం సహాయ సంచాలకులు గోవింద నాయక్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ఆసక్తి ఉన్న వారు ప్రధానోపాధ్యాయుడి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమగ్రశిక్షా ఉద్యోగులకు వేతనాల మంజూరు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సమగ్రశిక్షా ఉద్యోగులకు రెండు నెలల వేతనాలకు సంబంధించిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో సుమారు 2,800 మంది పని చేస్తున్నారు. దసరా పండుగ సమీపిస్తున్న తరుణంలో బడ్జెట్ విడుదల కావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వేతనాలు చెల్లించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సమస్య-సమాధానం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: పంటల సాగులో రైతులకు ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త నజీరుద్దీన్ 99665 05285 నంబరుకు ఫోన్ చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.



నజీరుద్దీన్(వ్యవసాయ శాస్త్రవేత్త, రేకులకుంట పరిశోధన కేంద్రం)

సమస్య: నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాం. పొలంలో అక్కడక్కడ మొక్కలు వాడిపోయి, క్రమంగా ఎండిపోతున్నాయి. సమస్యకు పరిష్కారం తెలపండి. **- నల్లప్ప(ఆకులేడు)**

సమాధానం: పత్తిలో ఎండు తెగులు నివారణకు వెంటనే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లలో నేల తడిచే విధంగా పోయాలి.

సమస్య: ప్రస్తుతం కంది పంట పూత, పిందె దశలో ఉంది. పంటకు మారుక గూడు పురుగులు ఆశించాయి. వాటిని ఎలా నివారించాలి. **- సురేశ్(కొర్రపాడు)**

సమాధానం: కంది పంటకు ఆశించిన మారుక గూడు పురుగులను నివారించడానికి వేపమందు 5 మి.లీ, క్లోరాంట్రీనిఫోల్ 0.3 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మొక్కజొన్నలో తెగుళ్లు నివారిస్తే అధిక దిగుబడి

చిట్కా

మొక్కజొన్న పంటకు వ్యాపించే తెగుళ్లను సకాలంలో నివారిస్తే అధిక దిగుబడి పొందవచ్చని రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 3 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోందని అన్నారు. పంటకు ప్రధానంగా ఆశించే కత్తెర పురుగుల నివారణకు 9 కిలోల ఇసుకకు, 2 శాతం సున్నం కలిపి మిశ్రమంగా చేసుకుని సుడుల్లో వేయాలని తెలిపారు. పురుగుల ఉద్ధృతి మరీ అధికంగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు, క్లోరాంట్రానిలిప్రోల్ 0.5 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కంకి నాణ్యత పెరగడానికి పిందె దశలో ఎకరాకు 50 కిలోల యూరియా పొలంలో చల్లుకోవాలని శాస్త్రవేత్త సూచించారు. – న్యూస్‌టుడే, నార్పల



జంతులూరులో సాగవుతున్న మొక్కజొన్న పంట

అద్దెకు వ్యవసాయ యంత్ర పరికరాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్తలు రైతుల కోసం నామమాత్రపు ధరకు వ్యవసాయ యంత్ర పరికరాలను అద్దెకు ఇస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో రబీ వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. బోర్లు, సాగునీటి కాలువల కింద పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ యంత్రాలు, పరికరాలు కొనుగోలు చేయలేని వారి కోసం పరిశోధనా కేంద్రంలో 300పైగా యంత్రాలు అందుబాటులో ఉంచారు. పవర్ టిల్లర్లు, మడకలు, గొర్రు, గుంటక, అనంత విత్తుగొర్రు, వేరుసెనగ, మొక్కజొన్న, కంది, వరి నూర్పిడి యంత్రాలు ఇలా అనేక పరికరాలను అందుబాటులో ఉంచారు. అవసరమైన రైతులు నామమాత్రపు డిపాజిట్ చెల్లించి తీసుకెళ్లవచ్చని ప్రధాన శాస్త్రవేత్త విజయ్ శంకర్‌బాబు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



రేకులకుంట పరిశోధనా కేంద్రంలో యంత్రాలు

బాలికల కబడ్డీ పోటీల్లో అనంతకు ద్వితీయ స్థానం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల కబడ్డీ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 156 మంది క్రీడాకారులు రెండు రోజుల పాటు హోరాహోరీగా తలపడి క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ పోటీల్లో విశాఖపట్నం జట్టు ప్రథమ, అనంతపురం జట్టు ద్వితీయ, శ్రీకాకుళం జట్టు తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన ఉత్తమ క్రీడా నైపుణ్యాలు ప్రదర్శించిన 17 మంది క్రీడాకారులను జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే ఈ క్రీడాకారులకు కొద్ది రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఒలింపిక్ సంఘ ముఖ్య సలహాదారులు పి.సుందరరావు, పీడీ, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.



బహుమతిని అందుకుంటున్న అనంతపురం జట్టు క్రీడాకారులు

వాహనం ఢీకొని వృద్ధుడి మృత్యువాత



ఓబుళప్ప

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన చెన్నేకొత్తపల్లి మండలంలోని యర్రంపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. న్యామద్దల గ్రామానికి చెందిన ఓబుళప్ప(75) యర్రంపల్లి వద్ద ఉన్న బంధువుల రైస్‌మిల్‌లో ఉండేవారు. ఆదివారం తెల్లవారుజామున టీ తాగేందుకు సమీపంలోని ఓ దాబా వద్దకు వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన ఓ వ్యక్తి గమనించి చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చాడు. అతడు అవివాహితుడు. ఆయన మేనల్లుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

శాస్త్రీయ విద్యకు ఉద్యమించాలి

అనంతపురం (గుల్జార్‌పేట), న్యూస్‌టుడే: శాస్త్రీయ విద్య కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత సమావేశాల్లో మూడో రోజు ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో వస్తున్న మార్పులపై అధ్యయనం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో అశాస్త్రమైన భావాలను పాఠ్య పుస్తకాల్లో జొప్పిస్తుందన్నారు. విద్యార్థులు, ప్రజలు చైతన్యవంతులై పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు రామ్మోహన్, పరమేశ్, వినోద్‌నాయుడు, అబ్దుల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా దాదాగాంధీ



ఉమానగర్(అనంతపురం), న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా అనంత నగరానికి చెందిన దాదాగాంధీ నియమితులయ్యారు. ఏఐసీసీ కార్యదర్శి వేణుగోపాల్ సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దాదాగాంధీ గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన నియామకంపై జిల్లా కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సత్యసాయి తాగునీటి పంపింగ్ ప్రారంభం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం చెరువులో ఉన్న సత్యసాయి తాగునీటి పథకం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు అధికారులు హెచ్చెల్సీ నీరు పంపింగ్ చేయడం ప్రారంభించారు. ట్యాంకుల్లో నీటి నిల్వలు లేకపోవడంతో బుక్కరాయసముద్రం, అనంతపురం గ్రామీణం, రాప్తాడు మండలాలకు గత 4 నెలలుగా సత్యసాయి తాగునీటి పథకం నీరు సరఫరా ఆగిపోయింది. దీనికితోడు కార్మికులు కూడా సమ్మె చేయడంతో గ్రామాలకు తాగునీరందడం లేదు. తాజాగా హెచ్చెల్సీ కాలువలకు అధికారులు నీరు విడుదల చేయడంతో రెండు మోటార్ల ద్వారా నీటికి ట్యాంకులకు ఎత్తిపోస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో తెదేపా నాయకుడి బలవన్మరణం



రాజారెడ్డి

రాప్తాడు, న్యూస్‌టుడే: అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన తెదేపా నాయకుడు రాజారెడ్డి(38) సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యులు, గ్రామస్థుల వివరాల మేరకు.. రాజారెడ్డి అప్పులు, ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలోని తోటకు వెళ్లి పురుగు మందు తాగారు. మెడలో తాడుతో సెల్ఫీ తీసుకుని, వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. అనంతరం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉన్న రాజారెడ్డి మృతదేహానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో అటెండరు దుర్మరణం



లాలెప్ప

పామిడి, న్యూస్‌టుడే : మండలంలోని గజరాంపల్లి గ్రామ సమీపాన 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పామిడి అంబేడ్కర్ కాలనీకి చెందిన లాలెప్ప (56) గుత్తి ఆదర్శ పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం గుత్తి నుంచి పామిడి వైపు వస్తుండగా గజరాంపల్లి గ్రామ సమీపాన వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్నేహితులే.. కడతేర్చారు

● హత్య కేసు ఛేదించిన పోలీసులు ● నిందితుల అరెస్టు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: స్నేహితులే తోటి మిత్రుడిని బండ రాయితో కొట్టి కడతేర్చినట్లు డీఎస్పీ రవిబాబు తెలిపారు. సోమవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. రాయదుర్గం పురపాలకంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సన్నయ్యగారి కొల్లప్ప (43) కనబడటం లేదని అన్న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. ఈనెల 1వ తేదీన పట్టణ శివారులోని గౌడ లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంట్లో కొల్లప్ప శవమై కనిపించాడు. తన తమ్ముడిని హత్య చేశారని అన్న ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. వాలంటీర్‌గా పని చేస్తున్న పవన్ కుమార్ కొల్లప్పకు పరిచయమయ్యాడు. పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడటంతో పవన్‌కుమార్‌ను తొలగించారు. మున్సిపాలిటీలో ఉద్యోగం కావాలని కొల్లప్పను అడగగా కొంత నగదు అడ్వాన్సుగా ఇచ్చాడు. వీరి ఇద్దరికి మధుసూదన్ అనే యువకుడు కూడా పరిచయమయ్యాడు. ముగ్గురు కలిసి మద్యంతో పాటు వ్యసనాలకు బానిసలయ్యారు. ఇందులో భాగంగానే సెప్టెంబరు 30న జగనన్న కాలనీలో ముగ్గురూ కలిసి మద్యం తాగారు. ఉద్యోగానికి ఇచ్చిన నగదు వెనక్కి ఇవ్వాలని గొడవపడ్డారు. మద్యం మత్తులో కిందకు పడిన కొల్లప్ప తలపై పవన్‌కుమార్, మధుసూదన్ బండరాయి వేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శవాన్ని నిర్మాణంలో ఉన్న ఇంట్లో పడేసి పరారయ్యారు. హత్య జరిగిన రోజు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొల్లప్ప ఒక వీడియో పోస్ట్ చేయడంతో దాని ఆధారంగా విచారణ చేయగా ఇద్దరు కలిసి హత్య చేసినట్లు అంగీకరించారని డీఎస్పీ తెలిపారు. హత్యకు ఉపయోగించిన రాయితో పాటు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. సాంకేతికత ఆధారంగా కేసును ఛేదించిన సీఐ జయనాయక్, ఎస్ఐ వలితో పాటు సిబ్బందిని ఎస్పీ జగదీశ్ అభినందినట్లు వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిబాబు, పోలీసు అధికారులు

పాముకాటుతో రైతు మృతి



లేపాక్షి

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: పొలంలో మొక్కజొన్న పంట కోసేందుకు వెళ్లిన రైతు లేపాక్షి (42) పాముకాటుకు గురై మృతిచెందిన ఘటన మండలంలోని భూపసముద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పొలంలో పనిచేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే గమనించి బంధువులు రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య సునీతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి పెద్దదిక్కు మృతితో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

బాణసంచా పట్టివేత.. కేసు నమోదు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని తేరువీధిలో రూ.64,800 విలువ చేసే బాణసంచాను 1వ పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ముంటిమడుగు రెడ్డిసాయి అనేవ్యక్తి బాణసంచాను తీసుకువచ్చి ఇంట్లో నిల్వ చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో 1వ పట్టణ ఇన్‌ఛార్జి సీఐ రెడ్డెప్ప, సిబ్బంది దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా బాణసంచాను విక్రయించేందుకు తీసుకొచ్చిన రెడ్డిసాయిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

పంచలోహ విగ్రహాలు స్వాధీనం

నిందితులు కోర్టుకు హాజరు



విగ్రహాలు, నిందితులతో ఎస్సై వెంకటనారాయణ, సిబ్బంది

అమడగూరు, న్యూస్‌టుడే: మండలంలోని తుమ్మలకొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంచలోహ విగ్రహాలను దొంగలించిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని సోమవారం కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై వెంకటనారాయణ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆగస్టు 27న తుమ్మలకొండలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి, పద్మావతిదేవిల పంచలోహ విగ్రహాలు, స్వామివారి వెండి ముఖ కవచం, గొడుగు చోరీ జరిగినట్లు కొత్తపేట, వెంకటనారాయపల్లి ప్రజలు ఫిర్యాదు చేశారు. ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు సోమవారం ఓబుళదేవరచెరువు మండలం మామిళ్లకుంట్లపల్లిలో నివాసం ఉంటున్న నగిరిగిరి గంగరాజు, ధర్మవరం మండలం ఎలక్కుంట్ల గ్రామానికి చెందిన చెడిపోతుల నాగరాజును వెంకటనారాయపల్లి మూడురోడ్ల కూడలిలో అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి పంచలోహ విగ్రహాలు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గంగారాజు గతంలో కూడా ఓబుళదేవరచెరువు మండలం తిప్పేపల్లిలో రైతులకు సంబంధించిన వ్యవసాయ పరికరాలను చోరీ చేసినట్లు గుర్తించి వాటిని కూడా రికవరీ చేసినట్లు ఎస్సై వెంకటనారాయణ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. సిబ్బంది సూర్యనారాయణ, విజయ్‌భాస్కర్, జబీవుల్లా, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూలి పనులకొచ్చి.. మృత్యుఒడికి

వీధిదీపాలు ఏర్పాటు చేస్తూ విద్యుదాఘాతం



నగేశ్

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : పెద్దవడుగూరులోని జామియా మసీదు కాలనీలో సోమవారం వీధి దీపాలు ఏర్పాటు చేస్తూ కూలీ నగేశ్ (40) విద్యుదాఘాతానికి గురై స్తంభం పైనుంచి పడి మృతి చెందాడు. చింతలచెరువు గ్రామానికి చెందిన అతను పంచాయతీ సర్పంచి ఆదేశాల మేరకు వీధి దీపాలు ఏర్పాటు కోసం కూలి పనులకు వచ్చాడు. విద్యుత్తు సరఫరా నిలిపేసి అతను స్తంభం ఎక్కాడు. వీధి దీపాలు సరిచేస్తున్న సమయంలో ఒక్కసారిగా విద్యుత్తు సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై పై నుంచి కిందపడ్డాడు. నగేశ్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విద్యుత్తు సరఫరా నిలిపివేసినా విద్యుదాఘాతానికి గురికావడంపై విద్యుత్తు అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాలనీలోని కొందరు ఇళ్లల్లో ఇన్వర్టర్ ఉండటం వల్ల విద్యుత్తు తిరిగి సరఫరా అయి ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు. నగేశ్‌కు భార్య భోగేశ్వరి, ఇద్దరు కుమారులున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిన్నరెడ్డెప్ప ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. భార్య భోగేశ్వరి నగేశ్ మృతదేహంపై పడి బోరున విలపించడం అందరినీ కలచివేసింది. చిన్నవడుగూరుకు చెందిన తెదేపా నాయకుడు దివాకర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.



ఘటనాస్థలంలో భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న భోగేశ్వరి

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

దసరా వస్తున్నా సరఫరాకాని రేషన్ బియ్యం


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

గోరంట్ల: దసరా పండగ దగ్గరపడుతున్నా ఇంతవరకు పులేరు చౌకదుకాణానికి బియ్యం సరఫరా జరగలేదని, లబ్ధిదారులకు పంపిణీ చేసేది ఎప్పుడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ తహసీల్దార్ మారుతికి సోమవారం ఫిర్యాదు చేశారు. 50 మందికిపైగా కార్డుదారులు ఉదయం కార్యాలయం వద్దకు చేరుకున్నారు. దుకాణ పరిధిలో సుమారు 400 వరకు కార్డులున్నాయని తహసీల్దార్‌కు వివరించారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్ కొత్తగా వెళ్లడంతో ఆలస్యం అయిందని, వెంటనే పంపే ఏర్పాటుతో పాటు పంపిణీకి చర్యలు తీసుకుంటామని చెప్పి పంపారు.

పట్టు ప్రోత్సాహకాలను వినియోగించుకోండి


అవగాహన కల్పిస్తున్న జేడీ శ్రీనాథ్

లేపాక్షి, న్యూస్‌టుడే: పట్టుపరిశ్రమ ద్వారా రైతులకు అందించే ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని ఆ శాఖ సంయుక్త సంచాలకుడు శ్రీనాథ్ పేర్కొన్నారు. మండలంలోని శిరివరంలో కేంద్ర పట్టు మండలి ఆధ్వర్యంలో విత్తన క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మల్బరీ సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచి దిగుబడులు సాధించేలా రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో శాస్త్రవేత్త ఇబ్రహీంబాషా, సహాయ సంచాలకుడు సురేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఏపీవోగా మధుసూదన్‌రెడ్డి

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షి మండలం ఉపాధి హామీ పథకం ఇన్‌ఛార్జి ఏపీవోగా మధుసూదన్‌రెడ్డిని నియమిస్తూ సోమవారం డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఉన్న జ్యోతి పుట్టపర్తి క్లస్టర్ ఏపీడీగా వెళ్లడంతో ప్రస్తుతం కార్యాలయంలో టీఏగా ఉన్న మధుసూదన్‌రెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

బాధ్యతల స్వీకరణ

రొళ్ల, న్యూస్‌టుడే: పెనుకొండ విద్యుత్తు ఏఈ నిజాముద్దీన్ సోమవారం రొళ్ల ఇన్‌ఛార్జి ఏఈగా బాధ్యతలు చేపట్టారు. హౌసింగ్ ఏఈగా కిశోర్, తహసీల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌గా మహమ్మద్‌రఫీక్, మండల సర్వేయర్‌గా కిరణ్, రొళ్లలో వీఆర్వోగా లక్ష్మీనరసింహులు సోమవారం బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు.

గోరంట్ల: గోరంట్ల మండల ఈవోపీఆర్‌ఆర్డీగా శివన్న సోమవారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు. లేపాక్షి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.

చిలమత్తూరు: చిలమత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా నేల కొండప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మడకశిర నుంచి చిలమత్తూరుకు బదిలీపై వచ్చారు.

గోరంట్ల: గోరంట్ల పోలీసుస్టేషన్ రెండో ఎస్సైగా సీ.బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇదివరకే ఇక్కడ ఎస్సైగా పనిచేశారు.

అన్నదాన భవన నిర్మాణానికి భూమిపూజ

లేపాక్షి: మండలంలోని కొండూరులో వెలసిన పురాతన శ్రీ బొమ్మప్ప ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం అన్నదాన భవన నిర్మాణానికి కళాశ ఆర్గానిక్ సంస్థ ముందుకొచ్చింది. సోమవారం సర్పంచి నిడిరెడ్డి, గ్రామస్థుల ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మాజీ సర్పంచులు శివప్ప, శ్రీరామప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీకి పేర్ల నమోదు

రొద్దం: ప్రభుత్వం రైతులకు రాయితీతో అందజేయనున్న శనగ విత్తనాలకు రైతు సేవా కేంద్రంలో సోమవారం నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో నివేదిత తెలిపారు. మండలంలో 750 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. దాదాపు 2 వేల ఎకరాల వరకు నల్లరేగడ భూములు ఉంటాయన్నారు. ఎకరానికి 20 కిలోల చొప్పున 10 ఎకరాల వరకు రాయితీ విత్తనం అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రెవెన్యూ అధికారి వైద్యానికి ఆర్థిక సాయం

పరిగి: పరిగి రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన భరత్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతున్నాడు. అతని వైద్యం కోసం పరిగి దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, భాజపా నాయకుడు వేణుగోపాలరావు సోమవారం సాయంత్రం పరిగి తహసీల్దార్ హసీనాసుల్తానాకు రూ. 25వేల చెక్కు అందించారు.

అర్జీలు పరిష్కరించాలని ఆందోళన

గోరంట్ల: పాలసముద్రం కూడలిలో చాలాకాలంగా సమస్యగా కొనసాగుతున్న ఇళ్ల స్థలాల అర్జీలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు ఆందోళన చేశారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న లేఅవుట్‌లలో ఎందరో అనర్హులకు పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. చివరిలో తహసీల్దార్ మారుతికి వినతి ఇవ్వడంతో విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకొంటామని చెప్పారు.

బాణసంచా స్వాధీనం

హిందూపురం: పట్టణంలోని ధనలక్ష్మీ రోడ్‌లో రెండు దుకాణాల్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.63,280 విలువ చేసే టపాకాయలు స్వాధీనం చేసుకొన్నట్లు పట్టణ ఒకటో పోలీస్ స్టేషన్ సీఐ రాజగోపాలనాయుడు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల: కళ్లితండాకు చెందిన రాములు బాయి సోమవారం విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సమస్యల కారణంగా ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం హిందూపురం తీసుకెళ్లారు.

అంత్యక్రియలకు అగచాట్లు

శ్మశానవాటికల్లో అసౌకర్యాలు.. ప్రజలకు ఇబ్బందులు



పెన్నానది ఒడ్డున సంతేబిదనూరు సమీపంలోని శ్మశానవాటిక

హిందూపురం గ్రామీణం, చిలమత్తూరు, లేపాక్షి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని హిందూపురం గ్రామీణం, చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో 38 పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీ కేంద్రాల్లో మాత్రమే శ్మశాన వాటికలు ఉన్నాయి. ఇందులో 26 చోట్ల అసౌకర్యాల మధ్యనే అంత్యక్రియలు చేయాల్సిన పరిస్థితి ఉంది. కిరికెర, చౌళూరు, సంతేబిదనూరు, బేవనహళ్లి, చాగలేరు గ్రామాల సమీపంలో నదీ పరివాహక ప్రాంతాలు ఉండటంతో కనీసం రోడ్లు లేవు. వర్షాకాలంలో మట్టిరోడ్లు బురదమయమై కనీసం నడవలేని పరిస్థితి. అలాంటి చోట శవాలను ఎత్తుకొని పోవాలంటే పరిస్థితి దారుణంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఐదేళ్లలో ఒక్కటీ కట్టలేదు

వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు శ్మశానవాటికలు కొత్తగా ఏర్పాటైన దాఖలాలు లేవు. 42 గ్రామాల్లో హరిశ్చంద్రఘాట్‌లను ఏర్పాటుచేయాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఎమ్పీడీవో కార్యాలయంలో అధికారులకు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదని ప్రజల్లో విమర్శలున్నాయి.

● హిందూపురం మండలంలో 14 పంచాయతీ గ్రామాల్లో శ్మశానవాటికలు ఉన్నప్పటికీ తుంగేపల్లి, కారాడిపల్లి, కెంచనపల్లి, సుబ్బిరెడ్డిపల్లి, నక్కలపల్లి తదితర గ్రామాల్లో వాటికలు ఏర్పాటుచేయడానికి ప్రభుత్వ స్థలం కావాల్సి ఉంది. ఇప్పటికే ఉన్న ఐదింటిలో రోడ్లు, ప్రహరీ నిర్మాణం చేయాల్సి ఉంది.



● చిలమత్తూరు మండలంలో కొడికొండ పెద్ద గ్రామం. ఇక్కడ జనాభా 3వేలు ఉంది. ఎవరైనా మృతి చెందితే తమ పొలాల్లోనే కాలువల పక్కనే పూడ్చుతున్నారు. కొత్తచామలపల్లి, వీరాపురం, పెద్దనపల్లి మొదలగు 10 పెద్ద గ్రామాల్లోనూ వైకుంఠధామాల కోసం స్థలం కావాలని ప్రజలు గతంలో అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోయింది.

● లేపాక్షి మండలంలో కొత్తగా 9 శ్మశానాలకు స్థలం ఇవ్వాలని ప్రజలు అధికారులను కోరితే ఆరింటికి ఇచ్చారు. అక్కడా సౌకర్యాలు కల్పించలేదు. చాలా ఏళ్లుగా ఉన్న పాతవాటిలో ఏడింటిలో అసౌకర్యాలున్నాయి. కనీసం రోడ్లు లేవు. రక్షణ గోడలు లేవు.

పరిశీలించి చర్యలు చేపడతాం

గ్రామాలకు వెళ్లి శ్మశానాల పరిస్థితులను పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టేలా తొలుత చర్యలు చేపడుతాం. ఆ తర్వాత నిధుల కోసం ప్రతిపాదనలు తయారు చేస్తాం. కొత్తగా కావాలని వాటి గ్రామాలను పరిశీలించి ప్రతిపాదనలు తయారుచేసి స్థలం కేటాయింపు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతాం.
-నటరాజు, ఈవోఆర్డీ, హిందూపురం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: తుంగేపల్లిలో కలుషితనీరు వస్తోంది. **-నారాయణప్ప**
సమాధానం: ట్యాంకును శుభ్రం చేయిస్తా. **-లలితమ్మ, సర్పంచి**
సమస్య: వెంకటాపురం నుంచి కొడూరుపల్లికి వెళ్లే రోడ్డులో కంప చెట్లు పెరిగాయి. **-వెంకటరెడ్డి, ఉద్యోగి**
సమాధానం: కొమ్మలను తొలగిస్తాం. **-నంజప్ప, సర్పంచి**
-న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

భూసమస్య పరిష్కరించాలని మహిళ ఆవేదన


కన్నీటి పర్యంతమవుతూ సమస్యను వివరిస్తున్న నందిని

పెనుకొండ, న్యూస్‌టుడే: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భూసమస్యపై ఫిర్యాదు చేయడానికి వచ్చిన గోరంట్ల మండలం ఎం.కొత్తపల్లికి చెందిన నందిని.. విషం తాగి ఆత్మహత్య చేసుకుంటానని కన్నీటిపర్యంతమయ్యారు. బాధితురాలు తెలిపిన మేరకు ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు దేవరరంగప్ప.. భూమి కొనుగోలుకు రూ.13లక్షలకు ఒప్పందం చేసుకుని రూ.3లక్షలు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా స్థలం చేసి వేధిస్తున్నారు. పలుమార్లు పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగలేదని వాపోయారు. రిజిస్ట్రేషన్ చేసుకుని మిగిలిన రూ.10 లక్షలు చెల్లించకుండా రెండేళ్ల నుంచి వేధింపులకు గురిచేస్తున్నారని.. ఆత్మహత్యే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో ఆమె తన సంచిలోని విషద్రావకం సీసా తీసుకోవడానికి యత్నించింది. అక్కడ ఉన్న పోలీసులు అప్రమత్తమై సంచిని లాగేశారు. ఆత్మహత్య చేసుకుంటే సమస్య తీరదు, ఇక్కడే ఆర్డీవో, డీఎస్పీ ఉన్నారు. విచారణ జరిపించి సమస్యను పరిష్కరిస్తారని మంత్రి సవిత హామీ ఇవ్వడంతో నందిని శాంతించారు.

మల్లాపల్లి చెరువుకు గండి.. ఆందోళనలో రైతులు


సర్పంచి, రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మారుతి

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల మండల పరిధిలోని మల్లాపల్లి చెరువుకు గండిపడడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. తహసీల్దార్ మారుతి వెళ్లి పరిశీలించారు. నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడానికి సోమవారం ఉదయం నుంచి ప్రయత్నిస్తున్నా అందుబాటులోకి రాలేదని సర్పంచి శివానంద ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులే ఉదయం నుంచి ఇసుకబస్తాలు వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేశామని అయినా నీటిలీకేజీ ఆగలేదని సర్పంచి వివరించారు. సర్పంచి, రైతులతో తహసీల్దార్ మాట్లాడి విషయాన్ని తెలుసుకున్నారు. ఈ తరహాలో అయిదు రోజుల నుంచి నీరు పారుతోంది. దీంతో రైతులు ఒక్కసారిగా కట్ట పగిలిపోతే ప్రమాదం జరుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. చెరువు పరిధిలో 150 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఈ సమస్యపై నీటిపారుదల శాఖ ఇన్‌ఛార్జి డీఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా తూము పక్కన చిన్నరంధ్రం ద్వారా నీటి లీకేజీ జరుగుతోందని కట్టకు ప్రమాదం లేదని చెప్పారు. మంగళవారం చర్యలు చేపడతామన్నారు.

మద్యం దరఖాస్తుల్లో ఇరువర్గాల పోటాపోటీ


ఎక్సైజ్ స్టేషన్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

పెనుకొండ, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు దాఖలు చేసేందుకు అధికార పార్టీ నాయకులు పెనుకొండలో పోటీపడ్డారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో పోలీసులు పెద్ద సంఖ్యలో ఎక్సైజ్ స్టేషన్ వద్ద మోహరించారు. ఇద్దరు సీఐలు సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టిబందోబస్తు నిర్వహించారు. సోమవారం 20 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ సుజనాబాబు వివరించారు. ఈ ఘటన పట్టణంలో చర్చనీయాంశమైంది. అధికార పార్టీకి చెందిన వారే పోటీ పడడంతో, దరఖాస్తు చేసుకోవడానికి కేవలం రెండు రోజులు మాత్రమే ఉన్నప్పటికీ వ్యాపార వర్గాల వారు ముందుకు వచ్చేందుకు జంకుతున్నారు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి


వైద్యాధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వచ్చే కాలానుగుణ వ్యాధులపై వైద్యసిబ్బంది, అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక ర.భ.శాఖ అతిథి గృహంలో నియోజకవర్గంలోని 5 మండలాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చిన రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. వైద్యశాలల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.


దుర్గామాతగా మరువగంగమ్మ


వాసవి అష్టలక్ష్మికి గంధం అలంకరణ


పరిగిలో చాక్లెట్ల ఆలంకరణలో కాళికామాత


చింతవిత్తనాల అలంకరణలో జలదుర్గమ్మ


పురంలో.. స్కందమాతగా మహాలక్ష్మి దేవి


గుడ్డంపల్లిలో సప్పలమ్మదేవి


చండీదేవీగా మోడల్ కాలనీ గంగమ్మతల్లి

విభిన్న రూపం.. అమ్మవారి దర్శనం


వేరుసెనగ కాయలతో కన్యకాపరమేశ్వరి


అమరాపురంలో..

దేవీ నవరాత్రుల్లో భాగంగా వివిధ అమ్మవారి ఆలయాల్లో ఐదవ రోజు సోమవారం విశేషాలంకరణలు నిర్వహించారు. చింతపిక్కలు, వేరుసెనగ, చాక్లెట్లు, అరటి పండ్లు, శాకాంబరి ఇలా భిన్నమైన వాటితో అమ్మవార్లను అలంకరించారు. స్కందమాతగా, గజలక్ష్మిగా, సత్యభామాకృష్ణావతారంగా శక్తిమాతలు భక్తులకు దర్శనమిచ్చారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. **-న్యూస్‌టుడే బృందం**


సోమందేపల్లిలో...


పెనుకొండలో అన్నపూర్ణ అలంకరణ


గోరంట్లలో శాకంబరిగా..

డ్రైవర్‌ను బెదిరించి నగదు, చరవాణి చోరీ

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక వెంకటాపురం రబ్బర్ ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఐచర్ వాహనాన్ని అడ్డగించి నలుగురు ఆగంతకులు డ్రైవర్‌ను కొట్టి నగదుతో పాటు చరవాణి అపహరించారు. ఏఎస్సై మురళీమోహన్ కథనం మేరకు వివరాలిలా.. కర్ణాటకలోని ములబాగల్ తాలూకా తాటిపాక నివాసి ఐచర్ వాహన చోదకుడు నయాజ్ వడ్డిపల్లిలో టమాట లోడు చేసుకొని హైదరాబాద్ మార్కెట్‌కు తరలించారు. అక్కడ నుంచి ఖాళీ వాహనంతో క్లీనర్ చాంద్‌పాషాతో కలిసి చోదకుడు తిరిగి వస్తుండగా రబ్బర్ ఫ్యాక్టరీ సమీపంలో రాగానే ఒక కారులో వచ్చిన నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు వాహనాన్ని అడ్డుకున్నారు. వాహనం నుంచి చోదకుడిని కిందకు దించి కొట్టి అతని వద్దనున్న రూ.6 వేల నగదు, రూ.15వేలు చేసే చరవాణిని లాక్కొని కారులో పరారయ్యారని ఏఎస్సై చెప్పారు. ఈ ఘటన జరిగిన చోటు పెనుకొండ మండలం అని, కాదు సోమందేపల్లి మండలం అంటూ రెండు పోలీస్ స్టేషన్ల ఏఎస్సైలు, సిబ్బంది ఉదయం నుంచి వాదులాడుకున్నారు. ఐచర్‌లో ఉన్న రూ.లక్షల సొమ్ము చోరీకి పాల్పడ్డారని చోదకుడు చెబుతున్నాడు. ఈ విషయంపై ఏఎస్సై మాట్లాడుతూ నగదు, చరవాణి మొత్తం రూ.21 వేలు చోరీ అయినట్లు ప్రస్తుతం కేసు నమోదు చేశామని, దర్యాప్తులో పూర్తి వాస్తవాలు తేలాల్సి ఉందన్నారు.

బంగారం, నగదు అపహరణ

చిలమత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని కోడూరు పంచాయతీ కనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన కృష్ణమూర్తి, శారదమ్మల ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు మేరకు.. సోమవారం ఉదయం 11గంటల నుంచి 3గంటల వరకు గోరంట్లలో తమ సొంత పనులు నిమిత్తం భార్య, భర్తలు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా 10 తులాల బంగారం, రూ.50వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. శారదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. చోదకులకు గాయాలు

పెనుకొండ: కొండాపురం రోడ్డుపై సోమవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో కొండాపురం గ్రామానికి చెందిన పోతిరెడ్డి, కొండంపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

మరో ప్రమాదంలో ఒకరు..

పెనుకొండ : మండలంలోని వెంకటగిరి పాళ్యం గ్రామానికి చెందిన రాజశేఖర్ ద్విచక్రవాహనంపై వెళుతూ కియా సమీపంలోకి రాగానే 44వ జాతీయ రహదారిపై అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

మురుగులో బోరు.. రోగాల జోరు

ఆర్.గొల్లహట్టిలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరుబావి వద్ద పిచ్చి మొక్కలు, మురుగు నిలిచి రోగాలకు నిలయంగా మారింది. బోరుబావి వంక ప్రాంతంలో ఉండటంతో అక్కడ పడుగుగా మారి నీరు నిలిచి పిచ్చి మొక్కలు పెరిగాయి. అక్కడున్న మురుగు పైప్‌లైన్ ద్వారా కుళాయిలకు సరఫరా అయితే రోగాలు ప్రబలే అవకాశం ఉంది. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రచన దృష్టికి తీసుకెళ్లగా బోరుబావి వద్ద నెలకొన్న సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. **-న్యూస్‌టుడే, రొళ్ల**



సొంత గూటికి వైకాపా కౌన్సిలర్లు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: రెండు నెలల కిందట తెదేపాలో చేరిన వైకాపా కౌన్సిలర్లు నలుగురు మళ్లీ సొంత గూటికి చేరుకున్నారు. ఆగస్టులో పది మంది వైకాపా కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌తో సహా ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో పార్టీలో చేరారు. వెంటనే ఛైర్‌పర్సన్ తన పదవికి రాజీనామా చేశారు. తెదేపా తరుపున ఛైర్‌పర్సన్‌గా రమేష్‌ను ఎన్నుకునేందుకు సర్వం సిద్ధమైంది. అయితే ఎన్నికకు ఇంకా నోటిఫికేషన్ జారీ కాలేదు. ఇలాంటి కీలక సమయంలో పార్టీలోకి వచ్చిన కౌన్సిలర్లలో నలుగురు వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. కౌన్సిలర్లు మల్లికార్జున్, రహమత్ బీ, నాగమణి, పరశురామ్‌లు సోమవారం వైకాపా నియోజకవర్గ ముఖ్యనేత వేణురెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. దీంతో వైకాపా బలం మళ్లీ 21 చేరింది. ఛైర్‌పర్సన్ ఎన్నిక కావాలంటే 21 మంది సభ్యుల బలం అవసరం. ఈ బలం వైకాపాకు మళ్లీ చేకూరడంతో ఛైర్‌పర్సన్ ఎవరు అవుతారు అనేది రసకందాయంలో పడింది. లక్ష్మి ఛైర్‌పర్సన్ అవుతారని వైకాపా భావిస్తోంది. హిందూపురం మున్సిపాలిటీలో రాజకీయం రోజుకు రూపుమారుతోంది.

పాఠశాల వెనుక.. నియంత్రిక



హేమావతి పంచాయతీ గొల్లమారనపల్లి ప్రాథమిక పాఠశాల భవనం వెనకవైపు విద్యుత్తు నియంత్రిక తక్కువ ఎత్తులో ఉండి ప్రమాదకరంగా ఉంది. విద్యార్థులు మూత్ర విసర్జన, ఆటలు ఆడేందుకు నియంత్రిక పక్కనే వెళుతుంటారు. ఈ విషయమై ఏఈ సిద్దేశ్వరను వివరణ కోరగా అవకాశం ఉంటే మరోచోటికి మారుస్తామని, లేదంటే చుట్టూ కంచె ఏర్పాటు చేస్తామన్నారు. **-న్యూస్‌టుడే, అమరాపురం**

గాజాపై దాడులు ఆపాలని శాంతి ర్యాలీ

హిందూపురం, న్యూస్‌టుడే: గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని, యుద్ధం వద్దు శాంతి ముద్దు అని సోమవారం సాయంత్రం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ మాట్లాడుతూ ఈ యుద్ధంతో దాదాపు 42వేల మంది చనిపోయారని, సోమవారానికి ఈ యుద్ధం ప్రారంభించి సంవత్సరం గడిచిందన్నారు. ఇప్పటికైనా దాడులు ఆపి ఇజ్రాయెల్ శాంతికి సహకరించాలని కోరారు. ర్యాలీలో పార్టీ హిందూపురం కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి బాబు, పట్టణ కార్యదర్శి మారుతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

జీవవైవిధ్య సంరక్షణపై అవగాహన

వీరాపురం(చిలమత్తూరు), న్యూస్‌టుడే: వాతావరణ కాలుష్య మూలంగా జీవావరణంపై ప్రభావం పడుతుందని బయో డైవర్సిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ చెన్నకేశవనాయక్ పేర్కొన్నారు. వీరాపురం గ్రామంలో సోమవారం గ్రామస్థులతో జీవశాస్త్రం ఉపాధ్యాయులు రామలింగయ్య ప్రదర్శనను చేపట్టారు. వాతావరణాన్ని సమతుల్యం చేయడానికి జీవవైవిధ్య సంరక్షణ ఎంతో అవసరమని తెలిపారు. భూమి ఉపరితలంపై వాతావరణ కాలుష్య కారణంగా జీవావరణం పూర్తిగా దెబ్బతింటుందని వివరించారు. కాలుష్యం ఉపరితలను చేరి ఓజోన్ పొర దెబ్బతిరడం మూలంగా రాబోయే రోజుల్లో భూమిపైన జీవావరణ తీవ్ర పరిణామాలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సాల్మన్‌రాజు, పర్యావరణవేత్త భాస్కర్‌రెడ్డి, సర్పంచి లక్ష్మీపతిరెడ్డి, కార్యదర్శి కేశవామూర్తి, భగత్‌సింగ్ సేవాసమితి వ్యవస్థాపకులు కార్తీక్, అటవీ బీట్ అధికారి ఉషారాణి, ఏబీవో కేశవప్ప, జీవశాస్త్రం ఉపాధ్యాయులు గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.


వీరాపురంలో ప్రదర్శన చేపడుతున్న బయోడైవర్సిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ చెన్నకేశవనాయక్

స్నేహ బంధం.. సేవా గుణం

పలు కుటుంబాలకు ఆర్థిక సాయం

గోరంట్ల, న్యూస్‌టుడే: తన కష్టాన్ని మరచి, మిత్రుడి కష్టాన్ని తెలుసుకుని ఇష్టంగా పాలుపంచుకునే వాడే నిజమైన స్నేహితుడు. గోరంట్లలో అలాంటి కోవకు చెందిన ఓ మిత్ర బృందం తోటి స్నేహితుల కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచి ప్రశంసలు అందుకుంటోంది. తమతో కలిసి బాల్యంలో చదువుకున్న మిత్రులు ఆర్యోపరంగా, పిల్లలను చదివించడానికి, బిడ్డలకు పెళ్లిచేసే విషయం ఇబ్బంది, లేక చనిపోయినా ఆకుటుంబాలకు ఆర్థిక ఆసరా కల్పించి ఆదర్శంగా నిలుస్తున్నారు. వారే గోరంట్ల ఉన్నత పాఠశాలలో 1986-87లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు. గడచిన 13 ఏళ్లలో పది కుటుంబాలకు సుమారు రూ.15లక్షల వరకు అవసరాలను బట్టి వివిధ సందర్భాల్లో నగదు అందజేసి మేమున్నామంటూ మనోధైర్యం నింపారు.

● గోరంట్లకు చెందిన అబ్దుల్లా, ఇర్షాద్ అనే మిత్రులు ఆరోగ్యపరంగా, పిల్లలను చదివించే విషయంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని గ్రూప్‌ద్వారా తెలుసుకున్నారు. అంతే క్షణాల్లో సమావేశం ఏర్పాటుచేశారు. తమ గ్రూప్ నిధి నుంచి శనివారం (5.10.24)న రూ. 1.86 లక్షలు అందజేశారు.


కృష్ణానాయక్ కుటుంబానికి గురువుల ద్వారా నగదు అందజేత (పాతచిత్రం)

● 2021లో కరోనా మహమ్మారీ బారినపడి ఇద్దరు మిత్రులు మరణించారు. వారిలో కృష్ణానాయక్ కుటుంబానికి రూ. 1.60లక్షలు, మహమ్మద్ రఫీ కుటుంబానికి రూ.2 లక్షలు అందజేసి స్నేహం విలువ తెలియపరిచారు.

● 2021 సెప్టెంబరులో తమ మిత్రుల్లో ఒకరైన రమేష్ కుమార్తె వివాహానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. రూ.2.28 లక్షలు అందజేసి వివాహ వేడుకలకు హాజరయ్యారు.


● 2022 నవంబరులో మరోమిత్రుడు శ్రీనివాసులు అనారోగ్యంతో మృతిచెందాడు. భార్య పిల్లలకు మనోధైర్యాన్ని నింపి రూ.1.60లక్షలు అందించారు.

అదృష్టంగా భావిస్తున్నాం..



మాది పేదకుటుంబం. ఇద్దరు కుమారులు. నాభర్త శ్రీనివాసులు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆయన స్నేహితులు మాఇంటికి వచ్చి ఆర్థిక సాయం అందించారు. ఆబ్యాచ్‌లో నాభర్త ఉండడం అదృష్టంగా భావించాం. ప్రస్తుతం నాఇద్దరు కుమారుల చదువులు పూర్తయ్యాయి. **-శంకరమ్మ, ఆంజనేయస్వామి కాలనీ, గోరంట్ల**

బయటకు చెప్పుకోలేకపోయా..



చిరువ్యాపారంతో జీవనం సాగించే కుటుంబం మాది. ఇద్దరు కుమార్తెలు. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. బయటకు చెప్పుకోలేకపోయా. ఆసమయంలో నాబాల్య మిత్రులు ఏర్పాటుచేసిన గ్రూపు గుర్తుకొచ్చి అందులో నాసమస్యలు వివరించా. అంతే వారు స్పందించి ఆర్థిక సాయం చేశారు. కష్టాల్లో ఉన్న మాకు కొంతవరకు ఊరట లభించింది. ఇలాంటి మిత్రులు దొరకడం గర్వంగా ఉంది. **-అబ్దుల్లా, గోరంట్ల**

● తమపేరు శాశ్వతంగా నిలిచిపోవాలన్న అభిప్రాయంతో రూ.3 లక్షలతో చదువులతల్లి విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటు చేశారు.

పుట్టపర్తి

• పుట్టపర్తి • ధర్మవరం • కదిరి • రాప్తాడు

ఘనంగా ఉమామహేశ్వర విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

నల్లమాడ, న్యూస్‌టుడే: రాగానిపల్లిలోని శివాలయంలో గణపతి ఉమామహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. అశేష భక్త జనసందోహం మధ్య మంగళవాద్యాలు, మంత్రోచ్ఛారణతో.. యాగం నిర్వహించి గర్భగుడిలో గణపతి సమేత ఉమామహేశ్వర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు అన్నదానం చేశారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



కదిరి, న్యూస్‌టుడే: ఫుట్‌బాల్ క్రీడాకారులకు సోమవారం విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సీనియర్ మెన్స్ ఫుట్‌బాల్ శిబిరం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు 22 జతల జెర్సీలను ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రావణ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9న గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటాలన్నారు. ఫుట్‌బాల్ జిల్లా కార్యదర్శి బీకే సలీం, కదిరి క్లబ్ కార్యదర్శి సిరాజుద్దీన్, ఉపాధ్యక్షుడు నిజాముద్దీన్, కోచ్ ఇర్షాద్ అలి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండల పరిషత్ ఈవోఆర్డీగా నటరాజ్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. రెండు నెలల కిందట ఇక్కడ పనిచేస్తున్న ఈవోఆర్డీ బదిలీ కావడంతో ఖాళీ ఏర్పడింది. మూడేళ్ల కిందట ఇక్కడ పనిచేస్తూ హిందూపురానికి బదిలీ అయిన అధికారిని తిరిగి ఇక్కడికే నియమించడంతో ఈవోఆర్డీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అలాగే ఎంపీడీవో స్థానం ఖాళీగా ఉండటంతో ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించనున్నారు.

● మండల ఆర్ఐగా కిరణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో పనిచేస్తున్న ఆర్ఐ పదోన్నతిపై వెళ్లడంతో రెండేళ్లుగా ఖాళీ ఏర్పడింది. కుందుర్పి నుంచి బదిలీపై వచ్చిన ఆర్ఐ బాధ్యతలు చేపట్టారు.

నల్లచెరువు ఎంపీడీవోగా రఘునాథగుప్తా



రఘునాథ గుప్తా

కదిరి: నల్లచెరువు ఎంపీడీవోగా రఘునాథగుప్తా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఎంపీడీవో శకుంతల బదిలీతో ఖాళీ ఏర్పడటంతో రఘునాథగుప్తాను ఇక్కడ నియమించారు. అంతకుముందు వెలుగు ఏపీఎంగా రమణప్ప నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న రవీంద్ర ఓడి చెరువుకు బదిలీ అయ్యారు.

నల్లమాడ ఏపీఎంగా గోపాల్



గోపాల్

నల్లమాడ: ఏపీఎం గోపాల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అమడగూరు ఏపీఎం నుంచి బదిలీపై నల్లమాడ వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం జయంతి తనకల్లు బదిలీ అయ్యారు.


కనగానపల్లి ఎస్సైగా..



ఇసాక్ బాషా

కనగానపల్లి, న్యూస్‌టుడే: కనగానపల్లి ఎస్సైగా ఇసాక్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న ఆయనను నియమించారు. ఎస్సైకు పోలీసు సిబ్బందితో పాటు ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్



ప్రమోద్ కుమార్

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ నూతన మున్సిపల్ కమిషనర్‌గా ప్రమోద్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం పలువురు అధికారులు నూతన కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న మల్లికార్జున బదిలీపై ప్రొద్దుటూరుకు వెళ్లారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ మాట్లాడుతూ అందరి సహకారంతో పట్టణాభివృద్ధికి కృషిచేద్దామని, మురుగు సమస్యలపై ప్రత్యేకమైన డ్రైవ్‌ను నిర్వహిస్తామని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే : కదిరి మండలం కదిరి బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని చెర్లోపల్లిలో నిర్మిస్తున్న చౌడేశ్వరీ దేవి ఆలయ నిర్మాణానికి తెదేపా నాయకుడు చిన్నా నాయుడు సోమవారం రూ.20 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు చేసుకోవాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పేద ఖైదీలకు సాధికార కమిటీ అమలుపై జిల్లాస్థాయి కమిటీ చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సాధికార కమిటీ అమలుపై కలెక్టర్ సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం పేద ఖైదీల మద్దతు కోసం ఒక పథకాన్ని రూపొందించిందని, దాని ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తుందని పేర్కొన్నారు. తమపై విధించిన జరిమానా చెల్లించలేక, ఆర్థిక ఇబ్బందుల కారణంగా బెయిల్ పొందలేక జైళ్ల నుంచి విడుదల కాలేకపోతున్న ఖైదీలకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు.

పారిశుద్ధ్య కార్యదర్శిపై కేసు

కదిరి పట్టణం: కదిరి మున్సిపాలిటీ మూర్తిపల్లి సచివాలయంలో పారిశుద్ధ్య కార్యదర్శిగా పనిచేస్తున్న వేమనారాయణపై కదిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సచివాలయంలో పారిశుద్ధ్య కార్యదర్శిగా పనిచేస్తున్న పరమేశ్ వేధిస్తున్నాడంటూ వేమనారాయణ గతంలో సూసైడ్‌నోట్ రాశారు. ఈ విషయాన్ని పరమేశ్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వేమనారాయణకు కౌన్సెలింగ్ ఇప్పించారు. అయినప్పటికీ మార్పు రాలేదని, తనపై అసత్య ఆరోపణలు చేస్తూ మానసికంగా ఇబ్బందికి గురిచేస్తున్నాడంటూ పరమేశ్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జనసేన నాయకుడి మృతి

బుక్కపట్నం, న్యూస్‌టుడే: బుక్కపట్నం గ్రామానికి చెందిన పత్తి సిద్దన్న కుమారుడు పత్తి చలపతి (79) అనారోగ్యంతో బాధపడుతూ సవీరా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పత్తి చలపతి 2019లో పుట్టపర్తి జనసేన అభ్యర్థిగా పోటీ చేశారు. మండల జనసేన నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పేరుకే సిల్క్ సిటీ..

రాత్రయితే చిమ్మ చీకటి

• ధర్మవరంలో ప్రధాన కూడళ్లలో వెలగని వీధిదీపాలు



శ్మశానవాటిక కూడలిలో వీధిదీపాలు వెలగకపోవడంతో చిమ్మచీకటి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ధర్మవరం పట్టణం నాణ్యమైన పట్టుచీరలకు, చేనేత పరిశ్రమకు దేశవ్యాప్తంగా పేరుగాంచింది. రాష్ట్రం నుంచేకాక ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారాలు, శుభకార్యాలకు చీరలు కొనుగోలు చేస్తుంటారు. రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంటుంది. దీంతో పట్టణమంతా పగటిపూటకాక రాత్రి వేళా నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి సిల్క్‌సిటీ కాస్త.. రాత్రయితే చిమ్మచీకటిగా మారుతుంది. పట్టణంలోని ప్రధాన కూడలిలో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన వీధిదీపాలు వెలగకపోవడంతో ప్రజలు చీకట్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుకు, డివైడర్లకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, దుకాణాల నుంచి వచ్చే దీపాల వెలుతురే ప్రజలకు, వాహనదారులకు దారి చూపుతోంది.

ఏటా రూ.పది లక్షలు ఖర్చు చేస్తున్నా..

పట్టణంలో కాలనీల్లో కలుపుకొని డివైడర్ల మధ్యలో 510 వీధిదీపాలు, 70 హైమాస్ట్ (పెద్దవి) దీపాలను ప్రధాన కూడళ్లలో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో ఏవైనా పాడైనా.. పనిచేయకపోయినా.. కొత్తవి ఏర్పాటు చేసుకునేందుకు మున్సిపల్ బడ్జెట్‌లో ఏటా రూ.10 లక్షల దాకా వెచ్చిస్తున్నారు. ఇంత ఖర్చు చేస్తున్నా పట్టణంలో పలుచోట్ల వీధిదీపాలు వెలగకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్లలోనూ ఒక్కటి వెలగడం లేదు. వర్షం కురిసిందంటే ఆ రాత్రంతా చీకటిగా ఉంటుందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన వీధిదీపాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

వర్షాకాలంలోనే సమస్య

వర్షాకాలంలో ఈదురుగాలులకు అక్కడక్కడ వీధి దీపాలకు ఏర్పాటు చేసిన తీగలు తెగిపడుతుంటాయి. ఆ సమయంలో విద్యుత్తు సరఫరా ఆగిపోతుంటుంది. కొన్నిచోట్ల ఈ సమస్యను పరిష్కరించాం. ఇలాంటివి ఎక్కడైనా ఉంటే గుర్తించి తీగలను సరిచేసి దీపాలు వెలిగేలా చూస్తాం.

– కళావతి, మున్సిపల్ జేఈ

శ్మశాన వాటిక సమీపంలో ప్రమాదాలు



గాంధీనగర్‌లో ఇళ్లు, దుకాణాల నుంచి వచ్చే వెలుగులే దిక్కు

పట్టణంలోని ప్రధాన కూడళ్లయిన గాంధీనగర్, శ్మశానవాటికి బస్టాండ్ సమీపంలోని ప్రియాంకనగర్, కేతిరెడ్డి ఎల్ 1, ఎల్ 2 కాలనీల్లో వీధిదీపాలు రాత్రిపూట సక్రమంగా వెలగకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్మశానవాటిక సమీపంలో దారిపొడవునా వీధిదీపాలు వెలగకపోవడం, మలుపులు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కనబడటం లేదని చోదకులు వాపోతున్నారు. దీంతో రోడ్డు దాటుతున్నప్పుడు చోదకులు వేగాన్ని నియంత్రించలేక నడుచుకుంటూ వస్తున్న ప్రజలను ఢీకొడుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222



సున్నపుగుట్ల తండాలో నిల్వ నీటితో పాచి పట్టిన రహదారి



ముష్టిపల్లి గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న తాగు నీటి ట్యాంకు

సమస్య : కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ సున్నపుగుట్ట తండాలో పాఠశాల సమీపాన వర్షం నీరు నిల్వ చేరడంతో రాక పోకలకు ఇబ్బందిగా మారింది. **- నాగేంద్ర నాయక్, సున్నపుగుట్ట తండా.**

సమస్య : కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ ముష్టిపల్లి ప్రాథమిక పాఠశాల సమీపాన తాగునీటి ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా ఉంది. **- గంగులప్ప, ముష్టిపల్లి.**

సమాధానం : సున్నపుగుట్ట తండాలో రహదారిపై నిలిచిన వర్షంనీరు, ముష్టిపల్లి పాఠశాల సమీపాన తాగునీటి ట్యాంకు పరిసరాలను శుభ్రం చేయించి గ్రామస్థులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

(పై ప్రశ్నలకు పంచాయతీ కార్యదర్శి శివశంకర్ సమాధానం ఇచ్చారు.)

– న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల ఔదార్యం ఎనలేనిది



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల ఔదార్యం ఎనలేనిదని ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. సోమవారం విజయవాడ వరద బాధితులకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మైలవరం, గన్నవరం నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే సమక్షంలో నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. వరద బాధితులకు 71 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎమ్మెల్యేల సమక్షంలో మాజీ మంత్రి పల్లె అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పల్లె రఘునాథరెడ్డికి ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలియజేశారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ఎజెండా



పొక్లెయిన్‌తో పనులు ప్రారంభిస్తున్న కందికుంట

తనకల్లు, న్యూస్‌టుడే: ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తల ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పనిచేస్తామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. సోమవారం తనకల్లు మండలంలోని గద్దలబండతండా నుంచి కందుకూరు క్రాస్ వరకు 8 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులను కందికుంట ప్రారంభించారు. రూ.2.50 కోట్ల ఎన్ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించబోతున్న పనుల శిలాఫలకంను ప్రారంభించిన కందికుంట పొక్లెయిన్‌తో పనులు మొదలుపెట్టారు. తహసీల్దారు శోభ సువర్ణమ్మ, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ వెంకటరమణ, తెదేపా మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు శంకరనాయుడు, రాజారెడ్డి, ఉత్తన్ననాయక్, సర్పంచి మూడే కాంతమ్మ, కోటిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

11న ఉపాధ్యాయ అవార్డుగ్రహీతల సమావేశం

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారితో ఈనెల 11న పుట్టపర్తి మండల విద్యాధికారి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు అత్యవసర సమావేశం ఉంటుందని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంఈవో-2 ప్రసాద్, వెంకటరత్నం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన రాష్ట్ర, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు, ఉపాధ్యాయులు సమావేశానికి తప్పక హాజరు కావాలన్నారు. సమావేశంలో ఉత్తర్వు 101, అవార్డు గ్రహీతలకు ఇళ్ల స్థలాలు, బస్‌పాస్‌లు, ఇతర సదుపాయాల గురించి చర్చించి రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించడంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

మద్యం మత్తులో గొడవ.. ఇద్దరికి గాయాలు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని మంజులాడ్జి వద్ద ఉన్న బార్ సమీపంలో సోమవారం మద్యం మత్తులో లోనికోటకు చెందిన నరేష్, లక్ష్మణ్, మల్లాకాల్వకు చెందిన నాగిరెడ్డి గొడవపడ్డారు. తనపై నరేష్ బీర్ సీసాతో దాడి చేశాడని నాగిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన చేతివేలు నాగిరెడ్డి కొరికాడని నరేష్ పోలీసులకు తెలిపాడు. గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గొడవలో పాల్గొన్న లక్ష్మణ్‌తో పాటు నరేష్, నాగిరెడ్డిపై ధర్మవరం 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

'అర్హులకు అన్యాయం చేసి వైకాపా వారికి ప్లాట్లు'

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్ద ఎలక్ట్రికల్స్ కార్మికులు, ప్లంబర్స్‌కు దక్కాల్సిన ఇళ్ల స్థలాలు వైకాపా ప్రభుత్వంలో అనర్హులకు ఇచ్చారని ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రికల్స్ అసోసియేషన్ నాయకులు తాజుద్దీన్, గోవిందరాజులు ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అసోసియేషన్ నాయకులుగా చెలామణి అవుతూ సురేంద్ర, రాజు వైకాపా నాయకులతో కుమ్మక్కై వీరికి కొన్ని, వైకాపా నాయకులకు మరికొన్ని ప్లాట్లు కేటాయించుకున్నారని విమర్శించారు. దీంతో అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. ప్రశ్నించిన తమపైనే కేసులు పెట్టారన్నారు. కూటమి పార్టీల నాయకులు తమకు న్యాయం చేయాలని కోరారు. బాబావలి, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు





ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి క్షేత్రస్థాయిలో అర్జీదారులు ఎదుర్కొంటున్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్‌తోపాటు జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్డీవో సువర్ణలు ప్రజల నుంచి 171 అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొత్తచెరువు మండలం తీరు మలదేవరపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 153-2లో తన పేరుమీద ఉన్న 9.6 ఎకరాలను వైకాపా ప్రభుత్వ హయాంలో నకిలీ ఆధార్‌కార్డు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని **తాన్‌సేన్‌సింగ్** అధికారులకు ఫిర్యాదు చేశారు. తన పేరు తాన్‌సేన్‌సింగ్ కాగా తాన్‌సేష్‌సింగ్‌గా చిత్రీకరించి 2022 జులై7న అనంతపురం గ్రామీణ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశాను. విచారణ చేశారు. ఆగస్టు 28న తిరిగి ఉరవకొండలో ఎవరికీ అనుమానం రాకుండా ఇతరుల పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. జిల్లా రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ మాధవి, కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్నకు ఫిర్యాదు చేశా, విచారణ చేశారు. తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని తాన్‌సేన్‌సింగ్ వేడుకున్నారు.

● ప్రైవేట్ సంస్థకు చెందినవారు భూమికి ఎలాంటి పరిహారం అందించకుండా అక్రమించారని, న్యాయం చేయాలని సీకేపల్లి మండలం న్యామద్దల గ్రామానికి చెందిన రైతు మంజునాథ వాపోయారు. జీవనధారమైన భూమిని కోల్పోయాను. న్యాయం చేయాలని కోరారు.

● హిందూపురం, లేపాక్షి, పరిగి చిలమత్తూరు మండలాల్లో జోరుగా కల్తీ కల్లు తయారు చేసి గ్రామాలకు తరలిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం అడుతున్నారు. తనిఖీలు చేసి తగు చర్యలు తీసుకోవాలని కొందరు ఫిర్యాదు చేశారు.

లోకజనని.. కరుణ రూపిణి



ధర్మవరం: కొత్తపేటలో అన్నపూర్ణేశ్వరిగా చౌడేశ్వరీదేవి



ధర్మవరం పట్టణం: అన్నపూర్ణదేవిగా పెద్దమ్మతల్లి



ముదిగుబ్బ: అర్ధనారీశ్వరస్వామి అలంకరణలో వాసవీమాత



కదిరి: కృష్ణావతార అలంకరణలో నరసింహస్వామి



పుట్టపర్తి గ్రామీణం: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి వేడుకలను ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల వ్యాప్తంగా ప్రముఖ దేవాలయాలు దసరా నవరాత్రుల ఉత్సవాలతో శోభిల్లుతున్నాయి. ఐదోరోజు అమ్మవారు స్కంధమాత, సరస్వతీదేవి, దుర్గాదేవి, నవదుర్గ, విజయదుర్గ, చాముండేశ్వరిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు మనసారా దర్శించుకుని అమ్మా సుజనపాలిని.. సుగుణ దాయిని కరుణజూపమ్మా అంటూ వేడుకున్నారు. హోమాలు, అర్చనలు, అభిషేకాలతో ఆలయాలు శోభిల్లాయి. – న్యూస్‌టుడే బృందం



తాడిమర్రి: కామాక్షిదేవిగా శ్రీకన్యకా పరమేశ్వరి



కదిరి పట్టణం: రాజరాజేశ్వరిగా మరకత మహాలక్ష్మి



బత్తలపల్లి: భక్తులకు అన్నదానం చేస్తున్న పారిశ్రామిక వేత్త రామినేని సందీప్, సతీమణి గీత



తనకల్లు: వెంకటేశ్వర స్వామిగా కన్యకాపరమేశ్వరి



నల్లమాడ: అన్నపూర్ణగా కొత్త బావి గంగమ్మ



కొత్తచెరువులో శివశంకరిగా రేణుకా ఎల్లమ్మ



కదిరి గ్రామీణం : మోహినీ అలంకారంలో మల్లాలమ్మ



చెన్నే కొత్తపల్లి: న్యామద్దల గ్రామంలో మహేశ్వరి అమ్మవారు



ధర్మవరం: వరాహ నరసింహ స్వామిగా లక్ష్మీచెన్న కేశవస్వామి

నియంత్రిక కూలితే ప్రమాదమే



ధ్వంసమైన విద్యుత్తు నియంత్రిక దిమ్మె

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 11 వార్డులో మున్సిపల్ ప్రాథమిక ఉన్నత పాఠశాల కాంపౌండ్‌కు అనుకుని నిర్మించిన విద్యుత్తు నియంత్రిక కూలేందుకు సిద్ధంగా ఉంది. నియంత్రిక కోసం నిర్మాణానికి ఏర్పాటు చేసిన దిమ్మెలోని రాళ్ళు ఊడి కింద పడుతున్నాయి. ఈ నియంత్రిక పాఠశాల సమీపంలో ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఏక్షణాన ఏం జరుగుతోందనని విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్తు ఏడీ లక్ష్మీనరసింహను వివరణ కోరగా దిమ్మెను పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

వాహనం ఢీకొని విరిగిపడిన స్తంభం



ధర్మవరం కూరగాయల మార్కెట్లో కూలిన విద్యుత్తు స్తంభం

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో సోమవారం తెల్లవారుఝామున వ్యాన్ ఢీకొని కరెంటు స్తంభం విరిగిపడింది. స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కరెంటు స్తంభం విరిగిపడిన సమయంలో జనసంచారం ఎక్కువ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే కరెంటు సరఫరా నిలచిపోవడంతో విద్యుత్తు అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడకు చేరుకొని కరెంటు స్తంభాన్ని తొలగించి సరఫరాను పునరుద్ధరించారు.

పేరుకే సుందరీకరణ.. అధ్వాన నిర్వహణ



పాదచారులూ వెళ్లడానికి వీలులేకుండా ఇలా..

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక కేంద్రం ప్రాధాన్యతను గుర్తించి 2016లో చిత్రావతినదీ ప్రాంతాన్ని పూల మొక్కలు, చక్కని ఫుట్‌పాత్‌లు, ఇతరత్రా సుందరీకరణ పనులు చేపట్టారు. చక్కని ఫుట్‌పాత్, విద్యుద్దీపాలతో భక్తులు, స్థానిక ప్రజలను అప్పట్లో ఆకట్టుకునేది. కాలక్రమంలో నిర్వహణలేక విద్యుద్దీపాలు కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో గత ఏడాది నవంబరులో కొత్తవి ఏర్పాటు చేశారు. అంతకు మించి ఇతరత్రా అభివృద్ధి పనులను గాలికి వదిలేశారు. దీంతో ప్రస్తుతం కంపు కొట్టే డస్ట్‌బిన్లు, వ్యర్థాలు, చెత్త చెదారంతో అపరిశుభ్రంగా మారింది. నడక కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను స్థానికులు ఇతర పనులకు వినియోగిస్తున్నారు. సుందరీకరణ రోడ్డు, చిత్రావతినదీ పరివాహకం పొడవునా ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లకు పూర్వ వైభవం తేవాలని బాబా భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

డీఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు



ఆవుల శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎస్పీ రత్న తదితరులు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: డీఎస్పీ శ్రీనివాసరావు విధి నిర్వహణలో సమర్థంగా వ్యవహరించారని ఎస్పీ రత్న పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావుకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆవుల శ్రీనివాసరావు మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీగా విధులు నిర్వహించడంతోపాటు పుట్టపర్తి ఇన్‌ఛార్జి డీఎస్పీగా కూడా సమర్థంగా పని చేశారని ప్రశంసించారు. బదిలీపై వెళుతున్న డీఎస్పీని శాలువతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఆర్ఐ వలి, ఎస్బీ ఎస్సై ప్రదీప్‌కుమార్ ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక



ఎంపీడీవోకు పత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

అమడగూరు : విధి నిర్వహణలో ఉద్యోగులు అనేక ఇబ్బందులకు గురవుతుంటారు. అలా ఎదురైన సమస్యను సమష్టిగా పరిష్కరించుకోవడానికి మండల నూతన పంచాయతీ కార్యదర్శుల సంఘాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నూతన కార్యవర్గ సభ్యులు ఎంపీడీవో మునెప్పకు ఎన్నికకు సంబంధించిన పత్రాన్ని అందజేశారు. మండల అధ్యక్షురాలిగా అమడగూరు కార్యదర్శి మమత, ఉపాధ్యక్షులుగా పూలకుంటపల్లి భాస్కర్, ట్రెజరర్‌గా చీకిరేవులపల్లి కార్యదర్శి చంద్ర, కార్యదర్శిగా కస్సముద్రం రామలింగారెడ్డి, సభ్యులుగా సునియా, నరేంద్ర, శ్రీనివాసులు, జానకిలను ఎన్నుకున్నారు.